సాక్షి కర్నూలు
సోమవారం | 30 | డిసెంబర్ | 2024



మల్లన్నకు పల్లకోత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ఆదివారం పల్లకోత్సవం నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పం పఠించారు.



మార్కెట్‌లో మాయాజాలం

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కొందరు కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు టెండర్ హాల్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్లతో కుమ్మక్కై రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,626.82
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 82.507
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 590
అవుట్ ఫ్లో	: 8,927

న్యూస్‌రీల్

శ్రీమఠంలో భక్తుల సందడి



దర్శన క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో భక్తులు వేలాదిగా శ్రీమఠానికి విచ్చేశారు. పవిత్ర తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల మూల బృందావన దర్శనం చేసుకున్నారు. స్వామి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. భక్తుల సందడితో శ్రీమఠం కారిడార్ ప్రాంగణం, అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లు కిక్కిరిశాయి.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.5 లక్షల విరాళం



దాతను సత్కరిస్తున్న డిప్యూటీ ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్న ప్రసాద పథకానికి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వి.భాస్కర రావు రూ. 5,00,004 విరాళం అందజేశారు. ఈ నేపథ్యంలో దేవస్థానం డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి ఆర్. రమణమ్మ, గంజి రవి దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం, శ్రీస్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేసి సత్కరించారు.

'నూతన' వేడుకల్లో హద్దు మీరితే చర్యలు

- డీఎస్పీ బాబుప్రసాద్

కర్నూలు: నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి పోలీసు శాఖ పలు సూచనలు చేసింది. 31వ తేదీన రాత్రి బహిరంగ ప్రదేశాల్లో రహదారులపై వేడుకలు నిర్వహించరాదని కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు రాత్రి పోలీసు బృందాలు నిరంతరం గస్తీ తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా వాహనాలు తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 31వ తేదీ అర్ధరాత్రి 1 గంట తర్వాత ప్రజలు రహదారులపై తిరగకూడదన్నారు. కర్నూలు సబ్ డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్‌లు కోయడం, బాణసంచా పేల్చడం నిషేధమన్నారు. డీజే, లౌడ్ స్పీకర్లు ఉపయోగించి ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నృత్యాలు చేయకూడదని సూచించారు. వేడుకల సందర్భంగా అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుభాకాంక్షలు చెప్పే నెపంతో కొందరు ఆకతాయిలు ఈవ్ టీజింగ్, స్నాచింగ్ చేసేందుకు అవకాశాలు ఉన్నాయని మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చాగలమర్రి ఎస్‌ఐపై బదిలీ వేటు

సాక్షి ఎఫెక్ట్

ఆళ్లగడ్డ: చాగలమర్రి ఎస్‌ఐ రమేష్‌రెడ్డిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఖాకీల అండతో జోరుగా పేకాట ఆడుతున్నారని 'సాక్షి'లో ఈనెల 14వ తేదీ 'రోజుకో చోట.. మూడు ముక్కలాట' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ కంబగిరిరాముడు ప్రత్యేక విచారణ చేపట్టి నివేదికలు అందజేసినట్లు తెలుస్తోంది. ఈ నివేదికల ఆధారంగా ఆదివారం ఎస్‌ఐ రమేష్‌రెడ్డిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేసినట్లు సమాచారం.

862 అడుగులుగా శ్రీశైలం డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 862 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 112.21 టీఎంసీల నీటి నిల్వ లు ఉన్నాయి. శనివారం నుంచి ఆదివారం వరకు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 0.338 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా 9,969 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు.

సైబర్.. టెర్రర్



2024లో పంజా విసిరిన సైబర్ నేరగాళ్లు

- ఏడాది పొడవునా ఖాతాలు ఖాళీ చేసేశారు
- చోరీలు, చైన్ స్నాచింగ్‌లతో బెంబేలు
- పెరిగిన పోక్సో కేసులు

2024 రివైండ్

సైబర్ నేరగాళ్లు హడలెత్తించారు. అమానవీయ ఘటనలు ఉలిక్కిపాటుకు గురిచేశాయి. వివిధ రూపాల్లో ఎదురవుతున్న దుర్ఘటనలు అలజడికి దారి తీశాయి. వ్యవస్థీకృతమైన నేరాలు సవాలుగా మారాయి. వీటి కట్టడికి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ఎప్పటికప్పుడు సాంకేతికత తోడుగా కేసుల ఛేదనకు ప్రయత్నిస్తున్నా సైబర్ నేరాలు, చోరీలు, గొలుసు దొంగతనాలు, అత్యాచారాలు వంటివి ఆగడం లేదు. ఈ ఏడాది జూలైలో అప్పటి ఎస్పీ కృష్ణకాంత్, డీఐజీ సెంథిల్ కుమార్ బదిలీ అయ్యారు. ఆ తర్వాత డీఐజీగా కోయ ప్రవీణ్ కుమార్, ఎస్పీగా బిందుమాధవ్ బాధ్యతలు చేపట్టారు. 2024 సంవత్సరానికి ముగింపు పలికేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో పోలీసు శాఖ జిల్లా వార్షిక నివేదికను ఆదివారం విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జరిగిన సైబర్ నేరాలు, పోక్సో కేసులు చూస్తే భయమేస్తోంది. ఇక రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తమయ్యాయి.

– కర్నూలు

వల వేసి.. ఖాతాలు ఊడ్చేశారు!

ఈ ఏడాది జిల్లాలో సైబర్ నేరగాళ్లు అందినకాడికి దోచుకున్నారు. కొందరి అత్యాశను సైబర్ నేరగాళ్లు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నకిలీ లింకులు పంపుతూ ఓటీపీ చెప్పమని నమ్మబలుకుతూ ప్రజల సొమ్మును ఖాతాల్లో నుంచి దోచేస్తున్నారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా పోలీసు శాఖ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉండటం ఆందోళనకర పరిణామం. అదనపు ఎస్పీ హుసేన్ పీరాతో కలసి ఎస్పీ బిందు మాధవ్ ఆదివారం నేర వార్షిక నివేదిక విడుదల చేశారు. గతేడాది 41 సైబర్ కేసులు నమోదు కాగా, ఈ సంవత్సరం 104 కేసులు నమోదయ్యాయి. పరువు పోతుందనో, విద్యావంతులే మోసపోయారని తెలిస్తే చులకనగా చూస్తారనే భయంతో ఫిర్యాదు చేయడానికి ముందుకు రాని బాధితులు ఇంతకు రెట్టింపు ఉన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుందాం....

మహిళలపై జరుగుతున్న నేరాలు సమాజాన్ని ప్రశ్నిస్తున్నాయి. గత ఏడాది వరకట్న మరణం, అత్యాచార కేసులు 13 నమోదు కాగా, ఈ ఏడాది కూడా అతివలపై ఆగడాలు ఆగలేదు. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై హింస ఆగడం లేదు. ఈ ఏడాది 398 మంది మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులు నమోదు కావడం కలవరపాటుకు గురిచేస్తోంది.



నేర వార్షిక నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

ముఖ్యంగా భర్తల వేధింపులు, అత్యాచారాలు, మహిళా కిడ్నాప్‌లు సైతం జరిగాయి. మహిళలు, యువతుల రక్షణకు చట్టాలను అమలు చేస్తున్నప్పటికీ వారిపై హింస, వేధింపులు ఆగడం లేదు. వరకట్న హత్యలు, వేధింపులు, ద్వితీయ వివాహం తదితర వేధింపులు జిల్లాలో కొనసాగుతున్నాయి. వరకట్న వేధింపులతో ఆత్మహత్యలకు ప్రేరేపించడం వంటివి ఈ ఏడాది కూడా కొనసాగాయి. 2023లో ఫోక్సో కేసులు (గ్రేవ్, నాన్ గ్రేవ్) 44 నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 62కు పెరగడం ఆందోళనకరం.

హత్యలు, హత్యాయత్నాలు అధికమే...

ఫ్యాక్షన్ జిల్లాగా పేరుగాంచిన కర్నూలు జిల్లాలో ఈ ఏడాది కూడా హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లు చోటు చేసుకున్నాయి. గత ఏడాది 38 హత్య కేసులు, 48 హత్యాయత్నం కేసులు, 15 కిడ్నాప్ కేసులు నమోదు కాగా ఈ ఏడాది కూడా 31 హత్య కేసులు, 39 హత్యాయత్నం కేసులు, 15 కిడ్నాప్ కేసులు, 4 దోపిడీ కేసులు నమోదు వంటి నేరాలు సవాలుగా మారాయి. జిల్లాలో విస్తృతంగా గంజాయి వినియోగం పెరిగింది. ఇందుకు పోలీసు స్టేషన్లలో నమోదవుతున్న కేసులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది 9 కేసుల్లో దాదాపు 33 మంది గంజాయి రవాణా, విక్రయదారులను అరెస్టు చేసి 55.38 కేజీల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు.

మొత్తం నేరాలు ఇలా...

2023	నేరం	2024
499	రోడ్డు ప్రమాదాలు	523
41	సైబర్ కేసులు	104
44	ఫోక్సో కేసులు	62
38	హత్యలు	31
48	హత్యాయత్నం కేసులు	39
15	కిడ్నాప్‌లు	15
149	దొంగతనాలు	138
12	మహిళలపై అఘాయిత్యాలు	10
152	ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నేరాలు	118

రూ. కోట్లలో జరిమానా...

నిబంధనలు పాటించని వాహనదారులపై ఈ ఏడాది భారీగా కేసులు నమోదయ్యాయి. 63,626 ఉల్లంఘన కేసులు నమోదు చేసి పోలీసులు రూ.2.41 కోట్ల జరిమానాను విధించారు. అలాగే వాహనాలు తోలుతూ మైనర్లు 3,631 పట్టుబడగా, రూ.19,42,585 పోలీసులు జరిమానా రూపంలో వసూలు చేశారు. 65 మట్కా కేసులలో 162 మందిని అరెస్టు చేసి రూ.7,22,542 నగదు సీజ్ చేశారు.

జోరుగా జూద శిబిరాలు...

జిల్లాలో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. నిర్వాహకులు వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం చేరవేసి ఎక్కడికక్కడ జూద శిబిరాలను నడుపుతున్నారు. జిల్లా కేంద్రం కర్నూలులో ఇటీవల వెలుగు చూసిన జూద శిబిరం రాష్ట్రస్థాయి అధికారులనే ఆశ్చర్యానికి గురిచేసింది. జూదంలో లక్షల్లో నష్టపోయిన కొంతమంది బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంతో గుట్టుగా కొనసాగుతున్న జూదశిబిరం రట్టయ్యింది. పోలీసు దాడుల్లో భారీ మొత్తంలో డబ్బులు పట్టుబడ్డాయి. నిర్వహణ ప్రదేశం, అక్కడికి వెళ్లే రూట్ మ్యాప్‌తో బాధితుడు పోలీసు ఉన్నతాధికారికి సమాచారం చేరవేయడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ఏడాది జిల్లాలో 252 పేకాట కేసులు నమోదు కాగా 1,251 మందిని అరెస్టు చేసి రూ.72,93,283 నగదును సీజ్ చేశారు.

రక్తమోడిన రహదారులు...



జిల్లాలో సగటున రోజుకు రెండు, మూడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జిల్లా మీదుగా కీలకమైన జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్తున్నాయి. నిత్యం వాహనాలు ప్రయాణికులతో రద్దీగా ఉంటున్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం, అపసవ్య దిశలో వెళ్లడం తదితర కారణాలతో జిల్లాలోని ప్రధాన రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. గతేడాది 499 రోడ్డు ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది వాటి సంఖ్య 523కు చేరింది.

మారని మందుబాబులు...

మద్యం తాగి పలువురు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా విధించి జైలుకు తరలిస్తున్నా మార్పు రావడం లేదు. ఈ ఏడాది జిల్లాలో 1,255కు పైగా డ్రంకెన్ కేసులు నమోదయ్యాయి.



తనిఖీల్లో పట్టుబడిన భారీగా నగదు, నగలు

దొంగల హల్‌చల్



జిల్లాలో చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి. దోపిడీలు, పగలు, రాత్రి, గొలుసు, సాధారణ, ఇలా అన్ని రకాల దొంగతనాలు గతేడాదితో పోలిస్తే తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నా బాధితులు పోగొట్టుకున్న సొమ్ము కోట్లలోనే ఉంటోంది. నగలు, నగదు పోగొట్టుకున్న బాధితులు వాటి కోసం స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. 2023లో అన్ని రకాల చోరీలు 149 చోటు చేసుకోగా ఈ ఏడాది నవంబర్ వరకు 138 చోరీలు జరిగాయి. రాత్రి దొంగతనాలు, సాధారణ, ఆటో మొబైల్ దొంగతనాలు, గొలుసు దొంగతనాలు ఎక్కువగా జరిగాయి. కర్నూలు–డోన్ జాతీయ రహదారి అమకతాడు టోల్ ప్లాజా దగ్గర ఫిబ్రవరి 3వ తేదీన భారీగా బంగారం, వెండితో పాటు భారీగా నగదు పట్టుబడింది. హైదరాబాదు నుంచి కొయంబత్తూరుకు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో భారీగా నగలు, నగదు తరలిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వెల్దుర్తి సర్కిల్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నంద్యాలకు చెందిన వ్యక్తి వద్ద రూ.1.20 కోట్లతో పాటు తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరుకు చెందిన ముగ్గురి దగ్గర నగలను స్వాధీనం చేసుకున్నారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళగంగ లో పుణ్య స్నానాలు ఆచరించి క్యూ లైన్లలో బారులు తీరారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూడు సార్లు మాత్రమే స్వామి వారి స్పర్శ దర్శనం కల్పించారు.



క్యూ లైన్‌లో దర్శనానికి బారులుదీరిన భక్తులు

నేటి నుంచి కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు: పోలీసు కానిస్టేబుల్ ఎంపికలకు సంబంధించిన దేహదారుఢ్య, శారీరక సామర్థ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పారదర్శకత కోసం దేహదారుఢ్య ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్, కాలికి చిప్‌తో కూడిన రిస్ట్ బ్యాండ్ అమర్చనున్నారు. దీనిపై ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఏపీఎస్పీ కర్నూలు రెండవ పటాలం మైదానంలో సోమవారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలు జరుగుతాయి. పాల్గొనే అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 4 గంటలకు ఏపీఎస్పీ పటాలం మైదానానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఏర్పాట్లలో భాగంగా ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యం, ఆహారం, నీటి వసతి, మరుగుదొడ్లు, వైద్య సౌకర్యం, అభ్యర్థుల బ్యాగులు, ఫోన్లు పెట్టుకోవడానికి, దుస్తులు మార్చుకోవడానికి అనువైన ప్రదేశాలు ఏర్పాటు చేశారు. ఆదివారం, ఇతర సెలవు దినాలు మినహా ప్రతి రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, పీఎంటీ, పీఈటీలు నిర్వహిస్తారు. యువతీ యువకులతో ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్‌ను ఎస్పీ బిందు మాధవ్ క్షేత్రస్థాయి అధికారులతో కలసి పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 నవంబర్ 28న పోలీసు కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై కోర్టు కేసులు నమోదవడంతో 2023లో ప్రాథమిక (ప్రిలిమ్స్) పరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి 10,143 మంది అర్హత సాధించారు. వారందరికీ నేటి నుంచి దేహదారుఢ్య, శారీరక సామర్థ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు జరుగనున్నాయి.



సీపీఎం 23వ జిల్లా మహాసభలతో ఎమ్మిగనూరు పట్టణం ఎరుపెక్కింది. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ఆ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల డప్పులు హోరెత్తగా.. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - వివరాలు 8లో▸

జలం.. కలుషితం!

- తాగునీటి ట్యాంకుల శుభ్రత గాలికి
- క్లోరినేషన్‌ను మరిచిన అధికారులు
- ఎస్‌ఏపీ స్కీం ద్వారా కూడా రక్షిత నీరు అంతంతే
- కోసిగి మండలంలోని పలు గ్రామాలకు నేరుగా నది నీరే

'గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను క్లీనింగ్, క్లోరినేషన్ చేయడంలో హొళగుంద, పెద్దకడబూరు మండలాలు వెనుకబడి ఉన్నాయి. ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేయండి' అంటూ ఈనెల 27వ తేదీన అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు.

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మెజార్టీ గ్రామ పంచాయతీల్లోని నీటి శుభ్రత ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. తాగునీటి ట్యాంకుల శుభ్రతను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రెండు శాఖల మధ్య లోపించిన సమన్వయంతో ప్రజలు కలుషిత నీటిని తాగి అనారోగ్యాల బారిన పడుతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో ట్యాంకులను శుభ్రం చేసి శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించాల్సి ఉంది. ప్రతి 15 రోజులకోసారి నీటి ట్యాంకులను శుభ్రం చేసి, శుభ్రం చేసిన తేదీని, తిరిగి ఎప్పుడు శుభ్రం చేస్తారో అనే తేదీని ఆయా ట్యాంకుల వద్ద ఉన్న నోటీసు బోర్డుల్లో తెలియజేయాల్సి ఉంది. అయితే నీటి ట్యాంకుల వద్ద ఈ నోటీసు బోర్డులే కనిపించడం లేదు. కొన్ని చోట్ల నోటీసు బోర్డులు ఉన్నా, ఆయా తేదీలను నమోదు చేసిన దాఖలాలు లేవు. ఆయా ట్యాంకులను శుభ్రం చేసి, నీటిని క్లోరినేషన్ చేసి కుళాయిలకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే క్షేత్ర స్థాయిలోని అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల కలుషితమైన నీటినే ప్రజలు తాగుతున్నారు. కంప చెట్లు, ఇతరత్రా చెట్లు ఏపుగా పెరిగిపోవడం వల్ల కొన్ని నీటి ట్యాంకుల పరిసరాల్లోకి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. నీటి ట్యాంకుల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం వల్ల అక్కడక్కడా నీటి సరఫరా పైపులు లీకై నీరు కలుషితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో అపరిశుభ్రంగా నీటి ట్యాంకు

జిల్లాలో నీటి ట్యాంకుల వివరాలు...

గ్రామ పంచాయతీలు	484
ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు	613
జీఎల్‌ఎస్‌ఆర్‌లు	349
సిస్టర్న్‌లు	2043



కోసిగి ఎస్‌ఏపీ నీటి పథకానికి సంబంధించిన ఫిల్టర్ బెడ్లు



కోసిగి మండలం చింతకుంట గ్రామంలో క్లీనింగ్ తేదీలు నమోదు చేయని ట్యాంకు

ఎస్‌ఏపీ స్కీం ద్వారా కూడా రక్షిత నీరు అంతంతే ...

కోసిగి మండలంలోని దుద్ది, తుమ్మిగనూరు, సాతనూరు, అగసనూరు, చిర్తనకల్లు, కోసిగి, సజ్జలగూడెం, జంపాపురం తదితర గ్రామాలకు తుంగభద్ర నది నుంచి ఎస్‌ఏపీ స్కీం ద్వారా రక్షిత నీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే మూడు దశాబ్దాల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్ల సామర్థ్యం ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా లేకపోవడం వల్ల ఫిల్టరేషన్ లేకుండా అడపాదడపా నేరుగా నది నీటినే ఆయా ట్యాంకులకు పంపింగ్ చేసి కుళాయిలకు వదలడంతో ప్రజలు రోగాల బారిన పడతామేమోనని ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

రక్షిత నీరు అందించాలంటే..

- ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎల్‌ఎస్‌ఆర్‌లను శుభ్రం చేయాలి. అలాగే ఆయా ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీ, తిరిగి శుభ్రం చేయు తేదీని నమోదు చేయాల్సి ఉంది.
- ఎన్‌ఐఎన్ గైడ్‌లైన్స్ ప్రకారం 20 లీటర్ల నీటికి 0.50 ఎంజీ క్లోరిన్ ట్యాబ్‌లెట్ కలపాల్సి ఉంది.
- తాగునీటిని సరఫరా చేసే పథకాలకు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాల్సి ఉంది.
- గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ స్టాక్ ఉంచుకోవాలి
- ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎల్‌ఎస్‌ఆర్‌ల వద్ద నీరు కలుషితం కాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- అనుమానం వచ్చిన నీటిని తాగకుండా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు ఆ నీటిని టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపాల్సి ఉంది.
- ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నీరు కలుషితం అవుతుంటే సంబంధిత సోర్స్‌ను క్లోజ్ చేయాలి.

రక్షిత నీటిని సరఫరా చేయాలి



ఎస్‌ఏపీ స్కీం ద్వారా రక్షిత నీటిని అందించాల్సి ఉంది. నీరు కలుషితమైతే అనేక రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అతిసారా వంటి వ్యాధుల బారిన పడితే నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉంది. ఎస్‌ఏపీ స్కీంకు సంబంధించిన ఫిల్టర్ బెడ్లను ఇప్పటికైనా మార్చి రక్షిత నీటిని సరఫరా చేయాలి.

– నగేష్, దుద్ది గ్రామం, కోసిగి మండలం

క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తాం



గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించే విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తీసుకుంటాం. క్లోరినేషన్ పక్కాగా చేసేందుకు పంచాయతీ ఈఓఆర్డీ, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పైప్ లైన్ లీకేజీలు వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు మరమ్మతులు చేపడుతారు. పల్లె ప్రజలకు సురక్షిత నీరు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాం.

– బీ నాగేశ్వరరావు, ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

క్లుప్తంగా

నిప్పంటించుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం


గాయపడిన చంద్రశేఖర్

ఆస్పరి: మండలంలోని చిన్న హోతూరు గ్రామంలో ఆదివారం చంద్రశేఖర్ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గ్రామానికి చెందిన రంగన్న, ఉలిగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు చంద్రశేఖర్‌కు భార్య, ఒక కూతురు ఉంది. కుటుంబ తగదా వల్ల చంద్రశేఖర్ ఇంట్లో తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. తర్వాత బయటకు వెళ్లి గ్రామానికి సమీపంలోని కల్వర్టు వద్ద శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నారు. అక్కడున్న వారు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆస్పరి సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లగా తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాపై దాడులు


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

కోడుమూరు రూరల్: హంద్రీ నది నుంచి అనుమతుల్లేకుండా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై రెండు రోజులుగా కోడుమూరు పోలీసులు ముమ్మర దాడులు నిర్వహిస్తున్నారు. మండలంలోని గోరంట్ల, కొత్తపల్లె, ముడుమలగుర్తి, వర్కూరు గ్రామాల్లో హంద్రీ నది నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా డోన్, ఎమ్మిగనూరు, గూడూరు వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనిపై కోడుమూరు పోలీసులు నిఘా పెట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. రెండు రోజుల్లో ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పట్టుకుని కోడుమూరు పోలీస్‌స్టేషన్ తరలించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

కోడుమూరు హంద్రీ నుంచి ఇతర ప్రాంతాల కు ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్ప వని కోడుమూరు సీఐ తబ్రేజ్ ఆదివారం హెచ్చరించారు. ఇసుక అక్రమ తరలింపుపై తమకు సమాచారమివ్వాలని, రవాణాను అడ్డుకోవడంతో పాటు, వాహనాలను సీజ్ చేసి తగిన చర్యలు తీసుకుంటామని సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


కారు ప్రమాదంలో గాయపడిన దంపతులు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎన్‌హెచ్ 44పై ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని ఓబులదేవరపల్లి బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న దంపతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వీరిని కర్నూలుకు తరలించారు. వీరి పేర్లు తెలియరాలేదు. అలాగే ఏనుగుమర్రి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోవడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వారిలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ రెండు ప్రమాదాల గురించి తమకు ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

టెండరు హాల్‌లో మాయాజాలం!

- ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లతో డేటా ఎంట్రీ ఆపరేటర్లు కుమ్మక్కు
- వాట్సాప్, మొబైల్ ఫోన్ల ద్వారా టెండర్ల ధరలు లీక్
- తద్వారా అనేక అక్రమాలు
- భారీగా నష్టపోతున్న రైతులు
- కట్టడి చేయడంతో టెండరు హాల్ వద్ద రభస
- మహిళా ఉద్యోగిపై కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్ల దురుసు ప్రవర్తన

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొందరు కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, టెండర్ హాల్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్లతో (డీఈఓ) కుమ్మక్కై రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అందరూ కలసిపోయి రైతులను దగా చేసి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా రైతులతో పాటు అనంతపురం, వైఎస్సార్ జిల్లా, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులు తాము పండించిన దిగుబడులను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకెళ్తే గిట్టుబాటు ధర లభిస్తుందనే నమ్మకంతో ఇక్కడికి వస్తుంటారు. వారి నమ్మకాన్ని వమ్ము చేస్తూ, అసంతృప్తి, ఆందోళనతో తిరిగివెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉల్లి, ఎండుమిర్చితో సహా అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులకు ఈ–నామ్ ద్వారా ఆన్‌లైన్‌లో టెండర్లు వేస్తారు. ఎక్కువ రేటు కోట్ చేసిన వ్యాపారికి ఆ లాట్ దక్కుతుంది. ఈ క్రమంలో మోసానికి తెరలేపారు. ధరలు తారుమారు చేస్తుండడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

డీఈఓలు, కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్ల కుమ్మక్కు

టెండరు హాల్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కొందరు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో కుమ్మక్కై ధరలను లీక్ చేస్తూ అంకెలను మారుస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. డీఈఓలందరూ అవుట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్నారు. 16 మంది డీఈఓలు ఉండగా కొందరు కాసుల కక్కుర్తితో రైతులకు తీరని ద్రోహం చేస్తున్నారు. టెండరు హాల్‌లో డీఈఓలు మినహా మార్కెట్ కమిటీ ఉద్యోగులు ఉండటం లేదు. దీన్ని అవకాశంగా తీసుకొని డీఈఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు స్వేచ్ఛగా టెండరు హాల్‌లోకి వచ్చి పనులు చేసుకొని వెళ్లిపోతున్నారు. టెండరు హాల్‌లో జరుగుతున్న అక్రమాలు ఇటీవల సెక్రటరీ దృష్టికి వెళ్లడంతో డీఈఓలపై పర్యవేక్షణ నిమిత్తం మార్కెట్ కమిటీకి చెందిన మహిళా ఉద్యోగిని నియమించారు. టెండరు హాల్‌లోకి ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లు రాకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఆమెదే. అయితే శనివారం కొందరు కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు టెండర్ హాల్‌కు వెళ్లి రభస చేసినట్లు తెలుస్తోంది.

➡ వాము లాట్‌కు ఒక వ్యాపారి అత్యధికంగా క్వింటాలుకు రూ.18 వేలు కోట్ వేసి ఉంటారు. ఇంకో వ్యాపారి రూ.15 వేలు కోట్ చేసి ఉంటారు. ఈ విషయాన్ని డీఈఓలు సంబంధిత కమీషన్ ఏజెంట్లకు, ఎక్కువ ధర కోట్ చేసిన ట్రేడర్‌కు లీక్ చేస్తారు. అప్పుడు అధిక ధర వేసిన వ్యాపారి డీఈఓ ద్వారా తన ధరను రూ.15001గా మార్పు చేయించి తక్కువ ధరకు లాట్ పొందుతాడు. వ్యాపారికి క్వింటాలుకు రూ.3 వేలు మిగులుతుండగా, రైతుకు అంతే మేర నష్టం జరుగుతుంది.

➡ ఇటీవల ఎండుమిర్చికి ఒక వ్యాపారి క్వింటాలుకు రూ.9 వేలు ధర కోట్ చేశారు. మరో వ్యాపారి రూ.8600 ధర కోట్ చేశారు. తక్కువ ధర కోట్ చేసిన వ్యాపారి లాట్‌ను పొందేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను లోబరుచుకొని తన ధరను రూ.9001గా మార్పు చేయించారు. ఒక్క రూపాయి అధికంగా కోట్ చేయడం వల్ల ఆ వ్యాపారికే లాట్ లభించింది. రూ.9 వేలు ధర వేసిన వ్యాపారికి ఈ విషయం తెలియడంతో మార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చి గొడవ చేయడంతో సర్దిచెప్పి పంపించేశారు.

➡ వేరుశనగ లాట్‌కు ఓ వ్యాపారి క్వింటాలుకు రూ.6900 ధర కోట్ చేసి ఉంటారు. ఇంకో వ్యాపారి రూ.6500 ధర కోట్ చేసి ఉంటారు. తక్కువ ధర కోట్ చేసిన వ్యాపారి డీఈఓ ద్వారా టెండరు ధరను రూ.6901గా మార్పు చేయించి అక్రమంగా లాట్ పొందుతాడు. ఇలాంటి ఘటనలు మార్కెట్ యార్డులో సర్వసాధారణం అయ్యాయి.


టెండర్ హాల్ రికార్డులను తనిఖీ చేస్తున్న సెక్రటరీ జయలక్ష్మి

అక్రమాలు ఇలా..!

వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేస్తారు. ధరలను ప్రకటించే వరకు ట్రేడర్లు, వ్యాపారులు టెండరు హాల్‌లోకి వెళ్లరాదు. కొందరు డీఈఓలు ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లతో కుమ్మక్కై ఏ లాట్‌కు అత్యధిక ధర ఎంత పడింది. తర్వాతి ధర ఎంత పడిందనే సమాచారాన్ని వాట్సాప్ ద్వారా లేదా సెల్‌ఫోన్ ద్వారా లీక్ చేస్తున్నారు. తర్వాత కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు స్వేచ్ఛగా టెండరు హాల్‌లోకి ప్రవేశించి ధరలను తారుమారు చేస్తున్నారు.

నిఘా కోసం రెగ్యులర్ ఉద్యోగి నియామకం

టెండరు హాల్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు ఇటీవల సెక్రటరీ గుర్తించారు. డీఈఓలపై నిఘా లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందని భావించి ఒక మహిళ ఉద్యోగిని పర్యవేక్షణ నిమిత్తం టెండరు హాల్‌లో నియమించారు. టెండరు హాల్‌లో పనిచేసే డీఈఓల మొబైల్ ఫోన్‌లు స్విచాఫ్ చేయించడం, హాల్‌లోకి కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు ప్రవేశించకుండా చేయడం వంటి చర్యలు తీసుకున్నారు. దీంతో కొద్ది రోజులుగా ధరలను తారుమారు చేయడం తగ్గిపోయింది.

కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్ల హల్‌చల్

ఈ క్రమంలో శనివారం కొందరు వ్యక్తులు టెండరు హాల్‌లోకి వెళ్లి ధరలను తారుమారు చేసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ముగ్గురు కమీషన్ ఏజెంట్లు, కొందరు ట్రేడర్లు ధరలను మార్చేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న మహిళా ఉద్యోగి అడ్డుకున్నారు. మమ్మల్నే అడ్డుకుంటావా? అంటూ వారు ఆమెను దుర్భాషలాడినట్లు తెలుస్తోంది. నీ అంతు చూస్తామంటూ బెదిరించినట్లు సమాచారం. ఈ విషయం సెక్రటరీ దృష్టికి వెళ్లడంతో ఉద్యోగిని తమ కార్యాలయానికి పిలిపించి విషయం తెలుసుకున్నారు. సదరు కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు సెక్రటరీ కార్యాలయానికి కూడా వెళ్లి మహిళా ఉద్యోగిని దూషించినట్లు తెలుస్తోంది. మనస్తాపానికి గురైన మహిళా ఉద్యోగి శనివారం స్థానిక 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

యువకుడిని రక్షించిన పోలీసులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆత్మహత్య చేసుకునేందుకు శ్రీశైలం డ్యాం వైపు వెళుతున్న యువకుడిని సున్నిపెంట పోలీసులు రక్షించారు. వివరాలు.. కర్నూలు జిల్లా, గూడూరు మండలం, జూలకల్లు గ్రామానికి చెందిన కురువ శ్రీనివాసులు గూడూరు మండలంలో పలువురి వద్ద రూ.95 లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకుని ఆదివారం ఉదయం శ్రీశైలం డ్యాంలో దూకేందుకు వెళుతున్నాడు. గమనించిన సున్నిపెంట పోలీసులు సిద్దయ్య, అబ్దుల్ రజాక్ చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్యా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చంద్రబాబు, ఎస్‌ఐ బి.వి.సుబ్బారెడ్డి ఘటనపై శ్రీనివాసులు బంధువులకు సమాచారమిచ్చి వారికి అప్పగించారు.

న్యూఇయర్ వేడుకలకు దూరం

కొలిమిగుండ్ల: స్థానిక పార్టీ కార్యాలయంలో 2025 జనవరి 1వ తేదీన జరుపుకునే న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదివారం తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో ఆయన గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం ఏడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించిందన్నారు. అందుకోసం న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు, అధికారులు ఈ విషయాన్ని గమనించి వ్యయప్రయాసలకోర్చి శుభాకాంక్షలు తెలిపేందుకు రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో ఎస్‌ఐ మృతి


ఎస్‌ఐ నాగవీరయ్య (ఫైల్)

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లా తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగవీరయ్య(60) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కొలిమిగుండ్లకు చెందిన నాగవీరయ్యకు ఐదు రోజుల క్రితం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ మృతి విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి తాడిపత్రికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. నాగవీరయ్య 1985లో కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. 2020లో ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. 2023లో ఎస్‌ఐగా ప్రమోషన్ లభించడంతో తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఇంకా 18 నెలల పాటు సర్వీసు ఉంది.

కేసుల ఛేదనలో ప్రతిభకు ప్రశంస


ఎస్పీ బిందు మాధవ్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న డీఎస్పీలు

కర్నూలు: కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులకు ఎస్పీ బిందు మాధవ్ ప్రశంసాపత్రాలు అందించారు. క్షేత్రస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. స్థానిక పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో ఆదివారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో మాట్లాడి వివిధ కేసుల్లో ప్రతిభ కనపరచిన పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకటరామయ్య, ఉపేంద్ర బాబు, సోమన్న, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఎస్‌ఐలు సమావేశంలో పాల్గొన్నారు.

సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు


మహానందికి వచ్చిన టీవీ నటుడు సెల్వరాజ్

మహానంది: టీవీ సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు వస్తుందని టీవీ నటుడు సెల్వరాజ్ (చక్రవాకం ఇక్బాల్) అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం ఆయన ఆదివారం మహానందికి వచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహానందీశ్వర స్వామి మహిమాన్వితుడని, గతంలో చాలా పర్యాయాలు ఇక్కడికి వచ్చానన్నారు. చక్రవాకం, మొగలిరేకులు సీరియల్స్‌తో పాటు పలు సీరియళ్లలో నటించానని చెప్పారు. ఆయన వెంట జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రసాద్, అర్చకులు ఉన్నారు.

స్నేహితుడి తల్లికి పరామర్శ

ఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన భరత్ స్వామి తల్లిని సెల్వరాజ్ ఆదివారం పరామర్శించారు. అలాగే కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. గ్రామానికి సీరియల్స్ నటుడు రావడంతో సందడి నెలకొంది. గ్రామస్తులతో సెల్ఫీలు దిగిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉందన్నారు.

మద్దిలేటి స్వామి సేవలో హంపి పీఠాధిపతి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని కర్ణాటక రాష్ట్రం హంపి పీఠాధిపతి శ్రీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, వేదపండితులు, సిబ్బంది పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు.


మద్దిలేటి స్వామి ఆలయంలో హంపి పీఠాధిపతి శ్రీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి

ఉద్యాన శాఖకు ఉత్తచెయ్యి

- ఒక్క రూపాయి బడ్జెట్ ఇస్తే ఒట్టు
- మొదటి క్వార్టర్ నిధులకే దిక్కులేదు
- నెలలు గడుస్తున్నా స్పందించని ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలల్లో ముగియనుంది. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూన్ నెలలో ఏర్పాటైంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 7 నెలలవుతోంది. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డిపార్టుమెంట్ల వారీగా ఆర్థిక, భౌతిక లక్ష్యాలు విడుదలయ్యాయి. అయితే ఉద్యాన శాఖకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బడ్జెట్ ఇచ్చిన దాఖలాలు లేవు. మామూలుగా అయితే మొదటి క్వార్టర్ బడ్జెట్ ఈ ఏడాది జూలై, ఆగస్టులోనే విడుదల కావాల్సి ఉంది. ఈ పాటికి రెండవ క్వార్టర్ బడ్జెట్ కూడా విడుదలై ఉండాలి. ఇంతవరకు మొదటి క్వార్టర్ బడ్జెట్ విడుదలకే దిక్కు లేకపోవడాన్ని పరిశీలిస్తే.. రెండు, మూడవ క్వార్టర్ల బడ్జెట్ సంగతేమిటనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ప్రత్యేకంగా ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదు. ఉద్యాన శాఖ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పథకాలను అమలు చేస్తోంది. ఈ పథకాలకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు కేటాయించాలి. కేంద్రం వాటా నిధులు రెండు, మూడు నెలల క్రితమే విడుదల చేసినప్పటికీ రాష్ట్రం మాత్రం స్పందించడం లేదు. ఎంఐడీహెచ్ కింద మొదటి క్వార్టర్‌లో కర్నూలు జిల్లాకు రూ.1.25 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.1.05 కోట్ల ప్రకారం విడుదల కావాల్సి ఉంది. రెండు నెలల క్రితం విడుదల కావాల్సిన నిధులు ఇంతవరకు విడుదలకు నోచుకోకపోవడంతో ఇటు రైతులు, అటు అధికారులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటల విస్తరణ, ఉద్యాన యాంత్రీకరణ, ప్యాక్‌హౌస్‌లు వంటి వాటికి సబ్సిడీ కింద ఈ నిధులు విడుదల కావాల్సి ఉంది. రూపాయి బడ్జెట్ ఇవ్వకపోయినప్పటికీ కలెక్షన్ సెంటర్లు, ప్యాక్‌హౌస్‌లు, కోల్డ్ రూములు, ఉల్లి నిల్వ గోదాములు అంటూ హడావుడి చేస్తుండటం పట్ల రైతులు, ఉద్యాన యంత్రాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇంగ్లిష్ మీడియం వద్దనడం దుర్మార్గం


డి.రామశేషయ్య

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం వద్దని కోరడం దుర్మార్గమని, ఇది అగ్రవర్ణాలు, ఆధిపత్య వర్గాల కుట్ర అని బహుజన టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డి.రామశేషయ్య ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సర్కార్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అమలు కోసం విడుదల చేసిన జీఓ 85ను రద్దు చేయాలని ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొన్న న్యాయకోవిదులు, రాజకీయ నాయకులు కోరడం అన్యాయమన్నారు. మాతృభాష తెలుగును బతికించుకోవడం కోసం ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మీడియాన్ని ప్రవేశపెట్టాలని కోరడంలో తప్పులేదన్నారు. అయితే కవులుగా చెప్పుకుని అభ్యుదయ భావాలు, మానవత్వం ఉన్న రచయితల పేరుతో జరిపే సభలో పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు మేలు జరిగే ఇంగిష్ మీడియాన్ని రద్దు చేయాలని కోరడం తగదన్నారు. సదస్సుల్లో పాల్గొన్న రచయితలు, మేధావుల పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారో వారి మనసుకు సమాధానం చెప్పుకోవాలన్నారు. మేధావులు ముందుగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు మీడియం మాత్రమే ప్రవేశపెట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేస్తే, తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని రద్దు చేసేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు.

కిడ్నాపైన యువతి సురక్షితం

కోవెలకుంట్ల: పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన ఓ యువతిని అదే రాష్ట్రానికి చెందిన యువకుడు కిడ్నాప్ చేసిన కేసును ఆ రాష్ట్ర పోలీసులు ఛేదించారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని పుర్బామేదినిపూర్‌కు చెందిన దేబాషిస్ మోండల్ అనే యువకుడు కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామంలో మినరల్ వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల ఆ రాష్ట్రానికి చెందిన ఓ యువతిని తీసుకొచ్చి గ్రామంలో దాచి ఉంచాడు. యువతి తల్లిదండ్రులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెల్‌ఫోన్ ట్యాపింగ్ ఆధారంగా కేసును ఛేదించారు. ఆ రాష్ట్రానికి చెందిన ఎస్‌ఐతోపాటు ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు గ్రామానికి చేరుకుని ఆదివారం దేబాషిస్ మోండల్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసుల ద్వారా ఆ యువతిని సురక్షితంగా ఆ రాష్ట్రానికి తీసుకెళ్లారు.

ఎస్సీ కులగణనపై అభ్యంతరాలు తెలపండి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని గ్రామ/ వార్డు సచివాలయాల్లో ఎస్సీ కులగణనకు సంబంధించిన నివేదికలు తప్పుగా ఉన్నాయని జైభీం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నివేదికలపై జైభీం సైనికులు తమ సమీపంలోని సచివాలయాలు, తహసీల్దార్, ఆర్‌డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో అభ్యంతరాలను లెటర్ హెడ్‌పై రాసి అందించాలన్నారు. రాష్ట్రంలో కురువలు ఉన్నారు కానీ, మదాసి/ మదారి కురవలు లేరని, అయినా వారు ఎస్సీలుగా అక్రమంగా సర్టిఫికెట్లు తీసుకుంటున్నారన్నారు. ఇలాంటి వాటిపై జైభీం నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సీ కులాలకు చెందిన వారికి సంబంధించిన వివిధ అంశాల నమోదులో కూడా తప్పులు జరుగుతున్నాయని, వాటిని కూడా గుర్తించి వినతి పత్రాలు అందించాలన్నారు. క్రిమిలేయర్ వర్తింపజేసే దిశగా ఎస్సీ వర్గీకరణను త్వరగా ఆమోదించుకునేలా కృషి చేయాల్సి ఉందన్నారు. సంఘం రాష్ట్ర సలహాదారు ఎరుకల అంజినయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సప్పోగు ప్రశాంత్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఆరేకంటి సత్యన్న, జిల్లా కన్వీనర్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి ఆటల పోటీలు


చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న కమలాపురం ఎంజేపీ విద్యార్థులు


బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూలు, కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గౌడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన విద్యార్థులకు జరిగిన జోనల్ స్థాయి ఆటల పోటీలు ఆదివారం ముగిశాయి. కబడ్డీ విజేతగా శ్రీశైలం, రన్నరప్‌గా బేతంచెర్ల మండలం, ఖోఖో విజేతగా కమలాపురం, రన్నరప్‌గా బేతంచెర్ల, టెన్నికాయిట్ విజేతగా కమలాపురం, రన్నరప్‌గా బేతంచెర్ల, వాలీబాల్ విజేతగా శ్రీశైలం, రన్నరప్‌గా కమలాపురం, క్యారమ్స్ విభాగంలో విన్నర్ కమలాపురం, రన్నరప్ శ్రీశైలం, హ్యాండ్‌బాల్ పోటీల్లో విన్నర్ గోరంట్ల, రన్నరప్‌గా జమ్ములమడుగు, షటిల్ విజేతగా కమలాపురం, రన్నరప్‌గా శ్రీశైలం గెలుపొందాయి. గేమ్స్ విభాగంలో చాంపియన్‌షిప్‌ను కమలాపురం జట్టు కైవసం చేసుకుంది. 100 మీటర్ల పరుగు పందెంలో శ్రీశైలం, బేతంచెర్ల, కమలాపురం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయి. లాంగ్‌జంప్‌లో బేతంచెర్ల, శ్రీశైలం, కమలాపురం, జావెలిన్ త్రోలో శ్రీశైలం, గోరంట్ల, బేతంచెర్ల, షాట్‌పుట్ విభాగంలో శ్రీశైలం, బనగానపల్లె, బనగానపల్లె ఎంజేపీ హైస్కూలు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

మిస్సయిన బంపరాఫర్

- బిర్యానీ కొంటే క్వార్టర్ ఫ్రీ అని ప్రకటించిన హోటల్ యజమాని
- కౌన్సెలింగ్ ఇచ్చి పంపిన పోలీసులు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో 2025 నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఓ యజమాని బంపర్ఆఫర్ ప్రకటించాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణ శివారులోని ఓ హోటల్ యజమాని నూతన సంవత్సర కానుకగా.. తమ హోటల్‌లో ఒక బిర్యానీ కొంటే క్వార్టర్ మద్యం ఫ్రీ అని, రెండు బిర్యానీలు కొంటే రెండు క్వార్టర్ల మద్యం ఫ్రీ అని ఆఫర్ ప్రకటించాడు. దీనిపై పట్టణంలో విస్తృతంగా ప్రచారం జరగడంతో చివరకు విషయం పోలీసుల వద్దకు చేరింది. పోలీసులు ఆ హోటల్ యజమానిని పిలిపించి మద్యాన్ని ఆఫర్ కింద ప్రకటించడం నేరమని కౌన్సెలింగ్ ఇచ్చారు. తాను చేసింది పొరపాటేనని యజమాని ఒప్పుకుని ఆఫర్‌ను విరమించుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో మద్యం ప్రియులు ముక్కు, మద్యం రెండు దూరమయ్యాయని నిరాశకు గురయ్యారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కూల్చివేత తప్పదు



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

ఎమ్మిగనూరుటౌన్: ప్రజలు, కర్షక, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలకు ప్రజలు ఘోరి కట్టే సమయం ఆసన్నమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ధ్వజమెత్తారు. సీపీఎం 23వ జిల్లా మహాసభల్లో భాగంగా ఆదివారం ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన సీపీఎం, అనుబంధ సంఘాల శ్రేణులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గఫూర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ దేశాన్ని నాశనం చేస్తోందని ఆరోపించారు. దీనికి రాష్ట్రంలోని టీడీపీ, జనసేన వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. రాయలసీమ ప్రాంతానికి పరిశ్రమలు తేవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందని దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్నారు. ప్రజలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలపై తీర్మానాలు చేసి ఆ మేరకు పోరాటాలు సాగిస్తామని జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. ఎమ్మిగనూరులో తాగు నీటి సమస్య పరిష్కారానికి రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం, చేనేతల సమస్యలు పరిష్కరించాలని, సాగునీటి వనరులను పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి నిర్మల, రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, జిల్లా నాయకులు రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ, వెంకటేశ్వర్లు, హనుమంతు, గోవిందు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.